


# ఇది కథకాదు

**కమలామణి**

ఇది కథకాదు. అయినా కథలాగే జరిగింది.

నేను రచయితని. ఒక చిన్న సంఘటనని ఆధారంగా తీసుకుని, నా ఊహాశక్తిని వినియోగించి, దాని చుట్టూ పెద్ద కథ అల్లుతాను. ఏవేవో ఊహలు ఎప్పుడూ నా మనసులో కెరటాల్లాగా, చేపపిల్లల్లా తుళ్ళి పడుతూ ఉంటాయి. ఎన్నెన్ని ఆలోచనలు వస్తాయంటే నాకు తరచూ రాత్రిళ్లు నిద్రపట్టదు!

ఈ ఊహాశక్తితోటే నేను నా జీవితంలో జరిగిన సంఘటన చుట్టూ కథ అల్లి, ఆ కథ నిజమని నమ్మాను.

నేటికి సరిగా పద్దెనిమిదిరోజుల క్రితం జరిగిన సంఘటన!

టైఫాయిడ్ జ్వరం రెండు వారాలు పీల్చి పిప్పిచేసింది నన్ను. మూడవవారం గడుస్తున్నది. టెంపరేచర్ నార్మల్‌కు వచ్చింది. కాని, మనిషిని మనిషిగాలేను. పూర్తిగా నిస్సత్తువ; కళ్ళు పూర్తిగా విప్పి చూడలేనంత బలహీనంగా ఉన్నాను.

అయితే బుర్రలో చురుకు ఏ మాత్రం తగ్గలేదు. ఏవేవో ఊహలు. ఒక్కొక్క ఊహను ఒక్కొక్క చిత్రమైన కథగా రూపొందించవచ్చు.

నిద్రపట్టకపోతే మళ్ళీ టైఫాయిడ్ తిరగ పెడ్తుందేమోనని డాక్టర్ నిద్రమాత్ర లిచ్చాడు.

నిద్రమాత్రతీసుకొని పడుకొన్నాను.

ప్రియంవద యింకా వంటిట్లోనే ఏదోపని చేసుకొంటున్నది.

రాత్రి తొమ్మిదిన్నర గంటలయింది. సన్నగా తుంపరపడటం ప్రారంభించింది. క్రమంగా పది నిమిషాల్లోనే పెద్ద వానగా మారింది.

మామూలుగా అయితే రాత్రిళ్ళుయిట్లా వాన పడుతూఉంటే, కిటికీ దగ్గరగా కుర్చీ, టేబుల్ వేసుకుని, వానచూస్తూ కథ రాస్తాను. ఆ కథ తప్పకుండా ఎంతో బాగుంటుందని, నాకథ చదివినవాళ్ళంతా మెచ్చుకొంటారు. వానచప్పుడు నాలో నిద్రించే ఊహలను మేలుకొల్పుతుంది! కొత్త కొత్త భావాలను సృష్టిస్తుంది.

నమ్మలేరుకదూ! 'పోలీస్ సబ్ యిన్స్పెక్టర్ ఏమిటి? కథలు వ్రాయడమేమిటి? నాన్సెన్స్! వాళ్ళ బుర్రల్లో దొంగలు గుండాలు, హత్యలు, దోపిడీలు! ఇవి తప్ప, జీవితం లోతుల్లోకి చూడడం. వాళ్ళకేమి చేతనవుతుంది?' ఇవేగా మీ ఊహలు!

నా ఊహలో, రచయిత కాదలచుకొన్నవాడు పోలీస్‌శాఖలో నన్నా ఉండాలి, లేదా డాక్టరన్నా కావాలి. రోజుకో రకం దోషి మాకూ, రోజుకో రకం రోగి డాక్టర్‌కూ చిక్కుతూ ఉంటారు. ప్రపంచంలోని రకరకాల వ్యక్తులు మాకు తారసపడుతుంటారు.

నేను మారుపేరుతో వ్రాస్తాను. నా కలం పేరేమిటో ప్రియంవదకు కూడా తెలియదు.

ఇదేమిటి? అసలు సంగతి మరిచి, పక్కదారి పట్టాను!

వానపడుతున్న రాత్రి అని కదూ చెప్పాను! ఆ శబ్దంవింటూ అలాగే మగత నిద్రలో పడ్డాను.

హఠాత్తుగా మెలకువ వచ్చింది.

వాన యింకా పడుతూనే ఉన్నదికానీ, నేను మేలుకోడానికికారణం వానచప్పుడు మాత్రం కాదు. ఏదో అస్పష్ట ధ్వని.

మరుక్షణం పూర్తిగా మేలుకొన్నాను. అయితే అలాగే, బద్ధకంగా పండుకొన్నాను.

వర్షపు హోరులోనుంచి నాకేదోధ్వని, గుసగుసలు లాగా వినిపించింది.

వంటింట్లోనుండి వినిపించుతున్నాయి.

"ఇష్! ఆయన లేస్తారేమో! చప్పుడు ...... వానలో......వద్దు...తగ్గి ... పోదువుగాని!" ఆ గొంతు ప్రియంవదది.

నాకుతెలియకుండానే నాలోని పోలీసు మేలుకొన్నాడు. ఊపిరి బిగబట్టి వినడం ప్రారంభించాను.

"ప్రియా! ఎన్నాళ్ళు ... ... మీ ఆయనతో...మంచిది...దాపరికం..."

మగగొంతు ఎప్పుడో, ఎక్కడో విన్న గొంతే! గుర్తుకు రావటంలేదు.

అర్ధరాత్రి ప్రియంవదకు మరో మగాడితో గుసగుస లాడవలసిన పని ఏమిటి? ఎవడు వాడు?

ప్రియంవదా! ప్రియంవదా!

ఆడదాన్ని నమ్మి ఎవడు బాగు పడ్డాడు! రూపవతి అయినభార్య శత్రు వుతో సమానమని పెద్దలు చెప్పనే చెప్పారు

దీని రూపాన్ని చూసి మోహించే నేను పెళ్లి చేసుకొన్నాను

పెండ్లినాటికి ప్రియంవదకు పందొమ్మిది వెళ్లినాయని అనుకొన్నారు. అన్నేళ్లూ అనాఘ్రాత పుష్పంగానే ఉందా ?

అయ్యో ! ఈ ఆలోచన పెండ్లికి ముందు రాలేదే !

అయితే ఏమాట కామాటే చెప్పకోవాలి ! ఇంతవరకూ, ప్రియంవదను చేసుకొన్నానని విచారించవలసిన అవసరం లేకపోయింది నాకు! అన్నివిధాలా అనుకూలవతే ! ఆమెలో నాకు కనిపించిన లోటేమిటంటే, ఆవిడది కాస్త స్వేచ్ఛా ప్రవృత్తి కాస్త తలతిక్క భావాలను (వాటిని స్వతంత్ర భావాలని అంటారులెండి !) అప్పడప్పడు చూపిస్తూ ఉండేది. ఇదే లోపమయితే, యిక లోపంలేని మనుష్య లుంటారా ?

కాని, నా మనసులో పేరుకుపోయిన నమ్మకాన్ని వమ్ము చేస్తూ, ప్రియంవద అర్ధరాత్రి ఎవరితోటో గుసగుసలాడుతున్నది ! ఎవడో మగవాడితోటి !

అరవనా ? సంగతేమిటని అడగనా ? లేచి వాడిని కాల్చి చంపనా ?

ఏం చెయ్యను ?

ఏం చెయ్యలేదు. అలాగే పడుకున్నాను.

కాసేపటికి ప్రియంవద వచ్చి పండుకొన్నది

ఎప్పటికో, తెల్లవారుజాముకు, నాకు కొద్దిగా నిద్రపట్టింది

మర్నాడు రాత్రి నిద్రమాత్ర వేసుకోలేదు నేను

నిద్రమాత్ర తీసుకొన్నానని భ్రమ పడింది, ప్రియంవద.

అర్ధరాత్రి మళ్లీ తలుపు తట్టిన చప్పడు. వాకిటితలుపుకాదు ! వంటింటి తలుపు.

పిల్లికూనలాగా ప్రియంవద లేచి, వంటింటివైపుకు నడిచింది.

నేను లేవలేదు.


వంటింట్లో గుసగుసలు మొదలు

"ఎవరన్నా చూస్తారేమో ! తొందరగా తిను ఇదిగో పాలు ! ఎందుకు చెప్ప మనకి దొంగ బ్రతుకులు !" ప్రియంవద గొంతు. సన్నగా ఏడుస్తూ మాట్లాడుతున్నది.

హఠాత్తుగా, చెప్పాపెట్టకుండా, జలజల చప్పడుచేస్తూ వానచినుకులు !

"ఇష్ ! మాట్లాడకు ప్రియా !... చెబితేనే బాగుంటుంది !...దాగుడు... రేపు...ఇప్పటికే అనుమానం..."

ఎంత హఠాత్తుగా వచ్చిందో, అంత హఠాత్తుగానే వానజల్లు తగ్గింది.




"సరే వెళ్లు! రేపీ వేళకు సిద్ధంగా ఉంటాను జాగ్రత్త!"

ప్రియంవద మాటలు.

ఏవో కథల్లో కులటల గురించి చదివానే గాని, నా జీవితంలో నేను మనసారా నమ్మిన భార్యే కులటవుతుందని కలలో కూడా అనుకోలేదు!

మనిషిని బ్రతికి ఉన్నానేగాని మనసు చచ్చిపోయింది?

వ్యభిచారిణులను పట్టి శిక్షించే నేను, వ్యభిచారిణిని యింట్లో పోషిస్తున్నాను.

ఏం చెయ్యాలని ఆలోచించి, ఉచిత నిర్ణయాన్ని ఆ రాత్రే తీసుకొన్నాను.

మామూలుగానే తెల్లవారింది.

ప్రియంవద కళ్లు ఏడ్చినట్టు ఎఱ్ఱగా ఉబ్బి ఉన్నాయి. .

ఎందుకో పాపం!

నేను మంచి నటుణ్ణి! తీసుకొన్న నిర్ణయాన్ని ప్రకటించే భావాలు చూపించలేదు నేను!

అతి ప్రేమను ఒలకబోశాను.

"నా మూలకంగా నీ ఆర్యోగం కూడా పాడవుతున్నది ప్రియా!" అని అంగలార్చాను.

"ప్రియా!" అని పిలిచినపుడు నాలో కలిగే భావసంక్షోభాన్ని మీ కెట్లా వివరించగలను!

నేనూ 'ప్రియా!' అనే పిలుస్తున్నాను! రాత్రి వచ్చినవాడూ 'ప్రియా' అనే పిలిచాడు!

నేను 'ప్రియా!' అని పిలవటానికి, అగ్నిసాక్షిగా పెండ్లాడిన భర్తను!

మరి, వాడు?

గుండెల్లో అగ్నిపర్వతం పొగలు కక్కుతున్నది!

ప్రియంవద పనిలో ఉండగానే, నిద్ర మాత్రలను, ఎనిమిదింటిని పొడి చేశాను.

అతి సులభం! పక్కనేవున్న స్టూల్ మీద మంచినీళ్ళచెంబు ఉంది. దానితో మాత్రలు నూరాను. న్యూస్ పేపర్ చించి, పొట్లంగట్టి దాచాను.

చెంబు అడుగునూ, స్టూల్‌నీ, శుభ్రంగా తుడిచాను.

నేను పోలీస్ ఆఫీసర్‌ని. నేరాన్ని దాచటం ఎట్లో నాకు చక్కగా తెలుసు!

రాత్రి మామూలుగా, పాలు స్టూల్ మీద పెట్టి, మళ్ళీ వంటిల్లు సర్దటానికి పోయింది ప్రియంవద.

ఇదే అదను!

పొడిని పాలల్లో కలిపాను. స్పూన్‌తో బాగా కలియబెట్టాను.

మరో పదినిమిషాలకు చేతులు తుడుచుకొంటూ వచ్చింది ప్రియంవద.

"ఏమిటి? ఇంకా మీరు నిద్రపో లేదూ? ఇట్లాగయితే ఎట్లాగండీ? అసలే బలహీనంగా ఉన్నారు! అదేమిటీ? పాలు యింకా తాగలేదూ? ఊ! తాగండి!" అంటూ పాలగ్లాసు నా దగ్గరికి తెచ్చింది.

"ప్రియా!" అంటూ చెయ్యిపట్టు కొన్నాను. అప్రయత్నంగా నా కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి!

ప్రియంవద గాభరాపడింది నా వాల కానికి

''ఏమిటండీ!" అంది కంగారుగా.

నేను నిగ్రహించుకొన్నాను

''ఎందుకో ప్రియా! ఊరికే కడుపులో తిప్పుతున్నది. ఈ పాలు నేను తాగలేను. కాస్త బత్తాయిపండ్ల రసం తీసివ్వు! ఈ పాలు నువ్వే తాగు!'' అన్నా.

"ఎందుకండీ! ఇప్పుడు బత్తాయి పండ్లరసం ? యిస్తాను. ఇంకోగంట పోయిన తర్వాత, పాలు తాగండి. నా కెందుకూ పాలు!" అంది మామూలుగా.

"అట్లా కాదు ప్రియా! నేను పండ్ల రసం, నీవు పాలు, ఒకేమారు తాగాలి. ఇది నా యిష్టం!'' అన్నా ప్రేమగానే ఆజ్ఞాపిస్తూ.

నా స్వహస్తాలతో, స్పూన్‌తో కలియ బెట్టి, పాలు యిచ్చాను ప్రియంవదకు. తాగింది. నిశ్చింతగా తాగింది.

ప్రియంవద చనిపోయి పద్దెనిమిది రోజులయింది

కర్మకాండకు వచ్చిన వాళ్ళంతా వెళ్ళి పోయారు.

రాత్రి, మళ్ళీ దొడ్డిగుమ్మం దగ్గర చప్పుడు

నెమ్మదిగా లేచి తలుపు తీశాను.

శాలువా ముసుగేసుకొన్న వ్యక్తి లోపలకు వచ్చాడు, "ప్రియా!'' అంటూ.

ఈడ్చి చెంపమీద కొట్టాను. అంత బలం ఎక్కడినుండి వచ్చిందో!

''నువ్వా, బావా! ప్రియ ఏది?" చెంప తడుముకుంటూ, ఆశ్చర్యంగా, భయంగా అన్నాడు ఆ వ్యక్తి.

బావ!

లైట్ వేశాను. నా ఎదురుగా ప్రియం వద అన్న బాబూరావు!

తలతిరుగు తున్నది నాకు! సంగతేమి టని అడిగాను.

చెప్పాడు. తనకు నక్సలైట్లు కొందరు స్నేహితులున్నారనీ, ఒక హత్యకేసులో బాగా అనుమానించి వెన్నాడుతున్నారనీ,




వాళ్ళకు కనపడకుండా దాగుకోవటం కష్టంగా ఉందనీ, చెప్పాడు.

"పది పదునైదు రోజుల క్రితం అర్ధరాత్రి వచ్చాను బావా! రెండు రోజులు వచ్చాను. ఇక్కడి పోలీసులకు ఎవరో నా గురించి చెప్పారని తెలియగానే పారిపోయాను. నీవప్పుడు జబ్బుగా ఉన్నావు. అందులోనూ పోలీస్ ఆఫీసర్ అయితివి. అందుకే నీతో ఏంచెప్పవద్దని ప్రియంవద గట్టిగా చెప్పింది. సరేగాని బావా! ఆకలి మండిపోతున్నది! ఈ పరారయినప్పటినుండీ ఒక్కరోజుకూడా కడుపు నిండా భోంచెయ్యలేదనుకో! ప్రియ ఏదీ? నువ్వు పోలీస్ ఆఫీసర్‌గా అరెస్ట్ చేయదలిస్తే, నేను భోజనంచేసిన తర్వాత చెయ్యి! ముందు ప్రియను పిలు!"

అతి దీనంగా అడుగుతున్నాడు బాబూరావు.

నేను అలాగే నిలబడ్డాను. చచ్చిపోయిన మనసు బ్రతికి ఘోషపెడుతున్నది!

"ప్రియ ఏది బావా?" తొందర పడుతున్నాడు బాబూరావు.

అవును! ప్రియ ఏదీ?

ఈ అనుమానితుడిని, ప్రియ అన్నను నేను పట్టివ్వగలను!

కాని, నన్ను, హంతకుడిని ఎవరు పట్టిస్తారు?

హఠాత్తుగా గుండెపోటుతో మరణించిందన్న అబద్ధాన్ని నిజమని నమ్మిన, నా చుట్టూగల ప్రపంచం పట్టిస్తుందా?

——